క్లుప్తంగా

7 నుంచి శ్రీవారి కల్యాణోత్సవం

మైలవరం: ద్వారకా తిరుమలలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వైశాఖ మాస తిరు కల్యాణోత్సవం మే 7 నుంచి 14వ తేదీ వరకు ఘనంగా జరుగుతుందని దేవస్థానం అనువంశిక ధర్మకర్త, మైలవరం జమీందారు ఎస్వీ సుధాకరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 11న స్వామి వారి కల్యాణం, 12న రథోత్సవం జరుగుతాయని చెప్పారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి



మైలవరం: విద్యార్థులు ప్రతిభ చూపి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మైలవరం శ్రీరాజా ఎస్వీఆర్జీఎన్నార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దాత జమీందారు ఎస్వీ సుధాకరరావు అన్నారు. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులు తెలగారపు గౌరీ శంకర్, ఆంగోతు నవీన్‌ను శుక్రవారం పాఠశాలలో అభినందించి సత్కరించారు. అనంతరం పాఠశాల అభివృద్ధిపై సమీక్షించారు. జమీందారు తనయుడు ఎస్వీ నివృత రావు, పాఠశాల హెచ్ఎం సతీష్, ఇన్‌చార్జి హెచ్ఎం శివరామకృష్ణ, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఇబ్రహీంపట్నం: ఉచిత వైద్యశిబిరం ఆదివారం ముత్తవరపు కల్యాణ మండపంలో జరుగుతుందని నిర్వాహకులు డాక్టర్ వెంకట శ్రీతేజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య పరీక్షలు జరుగుతాయని చెప్పారు.

రీసర్వేలో అవకతవకలపై ఫిర్యాదు

చింతలపాడు(తిరువూరురూరల్): చింతలపాడులో భూముల రీ సర్వేలో అవకతవకలు జరుగుతున్నాయని బీజేపీ ఓబీసీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు తుర్లపాటి వెంకటేశ్వరరావు, రైతులు జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. దస్తావేజులు, రెవెన్యూ రికార్డుల ప్రకారం భూములు సర్వే చేయకుండా సిబ్బంది హడావుడిగా మార్కింగ్ చేస్తున్నారని వారు ఆరోపించారు. సర్వే సక్రమంగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని కోరారు.

3 నుంచి క్రీస్తు సువార్త సభలు

నూజివీడు: నూజివీడు సీయోను ప్రార్థన మందిరం 29వ వార్షికోత్సవం సందర్భంగా మే 3 నుంచి 5వ తేదీ వరకు క్రీస్తు సువార్త ఉజ్జీవ సభలు నిర్వహిస్తామని కన్వీనర్ పాస్టర్ లాం ఇశ్రాయేలు, పాస్టర్ లాం అబెద్నిగో శనివారం తెలిపారు. ఉజ్జీవ సభలు పట్టణంలోని అజయ్యపేట ఇందిరా కాలనీలోని కమ్యూనిటీ హాల్ ఆవరణలో ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు జరుగుతాయని చెప్పారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి



నూజివీడు: పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లితండ్రులను ఉపాధ్యాయులు కోరారు. మండలంలోని గొల్లపల్లి హైస్కూల్ ఉపాధ్యాయులు మోర్సపూడిలో శనివారం ఇంటింటికి తిరిగి తల్లితండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించారు. హైస్కూల్‌లో ఉన్న సదుపాయాలు, ప్రభుత్వం అందించే సౌకర్యాలను వివరించారు. పుస్తకాలు ఉచితంగా ఇవ్వడంతో పాటు ప్రతి రోజూ మధ్యాహ్న భోజనం పెడతారని, అన్ని అర్హతలున్న ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందిస్తారని వివరించారు. ఫిజికల్ డైరెక్టర్ పి. రవీంద్ర, ఉపాధ్యాయులు జల్దు లక్ష్మి, కోటేశ్వరమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

డ్రెయినేజీపై మెట్ల నిర్మాణం



నూజివీడు: పట్టణంలో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు జరుగుతున్నా పురపాలక శాఖాధికారులు గాని, పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు గాని ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో ఎవరిష్టం వచ్చినట్లు వారు నిర్మాణాలను చేపడుతున్నారు. మైలవరం రోడ్డులోని గాంధీనగర్ గాంధీ విగ్రహం సెంటర్‌లో నిర్మించిన నూతన భవనానికి ఐరన్ మెట్లను ప్రహరీ బైట డ్రెయినేజీపై నుంచి ఏర్పాటు చేస్తున్నారు. అడ్డగోలుగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

సర్వేలతోనే సరి..!

- సర్వేల పేరుతో ఇంటింటికీ తిరుగుతున్న సచివాలయ సిబ్బంది
- పనుల కోసం మీసేవా కేంద్రాల చుట్టూ ప్రజల ప్రదక్షిణలు
- కళ తప్పుతున్న సచివాలయాలు



నూజివీడు మండలం దేవరగుంటలోని గ్రామ సచివాలయం

నూజివీడు: ఐదు వందల సర్వీసులను ప్రజలకు అందించే గ్రామ/వార్డు సచివాలయాలు ఎప్పుడు చూసినా ప్రజలతో కళకళలాడుతుండేవి. ఇదంతా ఒకప్పటి మాట. నేడు ఈ సచివాలయాలు కళ తప్పాయి. ఉద్యోగులు సర్వేల పేరుతో ఎప్పుడూ ఇళ్ల చుట్టూ తిరుగుతుండటంతో ప్రజలెవరూ సచివాలయాల వద్దకు రావడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని సేవలు ఇంటి గడప ముందుకు తీసుకువచ్చారు. కూటమి ప్రభుత్వం మాత్రం సచివాలయ సేవలను పక్కనపెట్టి సర్వేల పేరుతో సచివాలయ సిబ్బందిని ఇంటింటా తిప్పుతోంది. దీంతో ప్రజలకు సచివాలయంలో సేవలు అందకపోవడంతో వారు తమకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం మీసేవ కేంద్రాలకు, మండల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. మీసేవా కేంద్రాలకు వెళితే అక్కడ పెద్దఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నారు.

సెలవు రోజుల్లోనూ సర్వేలు..

నూజివీడు నియోజకవర్గంలో నూజివీడు పట్టణం, నూజివీడు, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి మండలాలతో కలిపి మొత్తం 94 సచివాలయాలున్నాయి. ప్రతి సచివాయలంలో 10 నుంచి 11 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరందరూ గత మూడు నెలలుగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏదో ఒక సర్వే చేస్తూనే ఉన్నారు. మన మిత్ర వాట్సప్ గవర్నెన్స్ సర్వే, గ్రామ సచివాలయ, వార్డు సచివాలయ యాప్‌లో ఈకేవైసీ సర్వే, పీ4 సర్వే, హౌస్‌హోల్డ్ జియోట్యాగింగ్ సర్వే, వర్క్ ఫ్రం హోమ్ సర్వే, ఆధార్ లేని పిల్లలను గుర్తించి వారికి ఆధార్ నమోదు చేయించడం, పుట్టిన పిలలకు బర్త్ సర్టిఫికెట్, ఆధార్ నమోదు వంటి ప్రక్రియ నిర్వహించాల్సి ఉంది. సెలవు రోజుల్లో సైతం సర్వేలు చేయాల్సి వస్తుండటంతో సచివాలయ సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో సచివాలయ సిబ్బంది వలంటీర్ల సమన్వయంతో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ క్యాస్ట్ సర్టిఫికెట్ నుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాల వరకు అన్ని సేవలను సచివాలయంలోనే అందించేవారు.



నూజివీడు పట్టణంలో సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది(ఫైల్)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ సేవలకు స్వస్తి పలకడమే కాకుండా సచివాలయ సిబ్బందితో నిరంతరం సర్వేలు చేయిస్తోంది. బూత్‌లెవెల్ ఆఫీసర్ బాధ్యతలను సైతం అప్పగించింది. ప్రతి నెలా మొదటి వారంలో పింఛన్ల పంపిణీని నిర్వహిస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న వీఏఏలు సర్వేల పేరుతో బయటకు వెళ్లడంతో రైతు సేవా కేంద్రాలకు వెళ్లే రైతులు అక్కడ సిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్నారు.

గత ప్రభుత్వంలో అన్ని సేవలు అందేవి



గతంలో సచివాలయాల ద్వారా ప్రజలకు అన్ని రకాల సేవలు అందేవి. ప్రభుత్వం అందించే పలు సంక్షేమ పథకాలపై సమాచారం అందించేవారు. ఏవైనా పత్రాలు కావాలంటే దరఖాస్తు చేస్తే సచివాలయాల్లోనే ఇచ్చేవారు. ఇప్పుడు మాత్రం పత్రాలు కావాలంటే మీసేవ కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సి వస్తోంది.

– దుర్గం పుల్లారావు, చాట్రాయి

ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు



గతంలో ఏ చిన్న అవసరం వచ్చినా సచివాలయానికి వెళ్లి పనులు చేసుకునే వాళ్లం. సచివాలయంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. మీ–సేవ కేంద్రాలకు, మండల కార్యాలయాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– కంచర్ల లవకుమార్, నూజివీడు

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు



నూజివీడు: నూజివీడు నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, చింతలపూడి నియోజకవర్గంలోని లింగపాలెం, చింతలపూడి మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకుల పోస్టుల భర్తీకి శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్, ఐసీడీఎస్ పీడీ పి. శారద, నూజివీడు డెప్యూటీ డీఎంహెచ్ఓ లక్ష్మీనారాయణ, నూజివీడు సీడీపీఓ కె. ధనలక్ష్మి, చింతలపూడి సీడీపీఓ మాధవి దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 10 అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు, 4 అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరిగాయి. ఈ నాలుగు వర్కర్ పోస్టులను ప్రమోషన్‌పై భర్తీ చేయనున్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు

చాట్రాయి: ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్లు 25 శాతం ప్రభుత్వం కల్పించిందని ఎంఈఓ బ్రహ్మచారి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో 25 శాతం విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్లు ఇస్తామని చెప్పారు. ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్ల భర్తీకి మే 15 వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

తెలంగాణ సరిహద్దుల్లో వాహనాల విస్తృత తనిఖీ



తిరువూరు సమీపంలోని రాష్ట్ర సరిహద్దుల్లో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

తిరువూరు: తిరువూరు సమీపంలోని తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లో శనివారం పోలీసులు వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాలు తనిఖీ చేసి అనుమానితులను ప్రశ్నించామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. వాహనాల రికార్డులు పరిశీలించడంతో పాటు గంజాయి, మద్యం అక్రమ రవాణా జరిపే వాహనాలను గుర్తించేందుకు ఈ తనిఖీ జరిపామన్నారు. తిరువూరు పట్టణంలోని లాడ్జీలలో కూడా తనిఖీలు నిర్వహించామని చెప్పారు.

- చాట్రాయి: వాహన చోదకులు తగిన పత్రాలతో వాహనాలను నడపాలని ఎస్ఐ రామకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని కృష్ణారావు పాలెం అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ కలిగి ఉండాలని చెప్పారు. అతివేగంతో వాహనాలను నడపవద్దని, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలని వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

హెల్మెట్ తప్పనిసరి

- ఆగిరిపల్లి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ శుభశేఖర్ అన్నారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ రోడ్డులో శనివారం వాహనాలను తనిఖీ చేసి ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం వలన ప్రమాదాల తీవ్రత తగ్గి ప్రాణాలు నిలబడతాయన్నారు. వాహనదారులు నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉద్యోగుల నిరసన ప్రదర్శన



నిరసన తెలుపుతున్న మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీఓ నంబరు 35కు వ్యతిరేకంగా మండల పరిషత్ ఉద్యోగులు శనివారం కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఉద్యోగులు మాట్లాడుతూ జీఓ నంబరు 35 వల్ల పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈఓపీఆర్డీలకు ఎంపీడీఓలుగా ప్రమోషన్లు ఇవ్వడం వల్ల పంచాయతీరాజ్ ఉద్యోగులకు ప్రమోషన్లు ఎండమావిగా మారతాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీఓ నంబర్ 35పై పునరాలోచించి దానిని సవరించడం ద్వారా పంచాయతీరాజ్ మినిస్టీరియల్ సిబ్బందికి న్యాయం చేయాలని కోరారు. ఎంపీడీఓ కార్యాలయ ఏఓ బేబీ, సీనియర్ అసిస్టెంట్ ఎం. సుష్మ, జూనియర్ అసిస్టెంట్ ఎల్. సుష్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలి

చాట్రాయి: ఉపాధి కూలీలకు వెంటనే వేతనాలు చెల్లించాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఉపాధి కూలీలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రెండు నెలల నుంచి పనులు చేస్తున్న ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. పని సమయం తగ్గించాలని, వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సభ్యులు బక్కయ్య, బాబూరావు, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

ఇబ్రహీంపట్నం: మండలానికి చెందిన ఓ ప్రేమ జంట పెద్దలను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకున్నారు. అనంతరం రక్షణ కోరుతూ శనివారం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. సేకరించిన వివరాల ప్రకారం.. తుమ్మలపాలెం గ్రామానికి చెందిన బత్తుల సందీప్, మూలపాడు గ్రామానికి చెందిన పాటిబండ్ల అఖిల బంధువులు అవుతారు. సందీప్ పాలిటెక్నిక్‌లో డిప్లమో చేయగా, అఖిల బీఎస్సీ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. కొన్నాళ్లుగా వీరు ప్రేమించుకుంటున్నారు. పెద్దలకు విషయం చెప్పగా వారు వివాహాన్ని వ్యతిరేకించారు. ఇద్దరూ మేజర్లు అయినందున చందర్లపాడులోని ఓ దేవాలయంలో స్నేహితుల సమక్షంలో వివాహం చేసుకున్నారు. రక్షణ కోరుతూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు.

సురక్షిత ప్రాంతానికి ట్రాన్స్‌ఫార్మర్లు



జి.కొండూరు: జి.కొండూరు–గంగినేని ప్రధాన రహదారిని ఆనుకొని గడ్డమణుగు రోడ్డులోని రైస్ మిల్లు వద్ద ప్రమాదకరంగా ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్లను విద్యుత్ శాఖాధికారులు శనివారం తొలగించి రహదారికి దూరంగా సురక్షిత ప్రాంతంలో అమర్చారు. విద్యుత్ శాఖ ఏడీఈ ఐ.సుధాకర్, స్థానిక ఏఈ మహమ్మద్ షఫీ, లైన్ ఇన్‌స్పెక్టర్ పసుపులేటి వెంకటేశ్వరరావు, లైన్‌మెన్ తుక్కిశెట్టి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో సిబ్బంది యుద్ధప్రాతిపదికన ఆరుగంటల సమయంలోనే పనులను పూర్తి చేశారు.

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు

ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎస్ఐ దుర్గాప్రసాద్

మైలవరం: మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ దుర్గా ప్రసాద్ అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మాదక ద్రవ్యాలపై శనివారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాలు యువత జీవితాలను చిత్తు చేస్తున్నాయని, మత్తు పదార్థాలతో విద్యార్థులు తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు మాట్లాడుతూ కొంతమంది డ్రగ్స్ కోసం నేరాలకు పాల్పడుతున్నారన్నారు. చివరికి ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారని చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రమేష్‌రెడ్డి, డీన్స్, విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బి. శివహరిప్రసాద్, ఈగల్ క్లబ్ కో–ఆర్డినేటర్ శీలం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

తిరువూరు: విద్యార్థులు మద్యపానం, మత్తుపదార్థాల జోలికి వెళ్లవద్దని తిరువూరు సర్కిల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జె. శ్రీనివాస్ అన్నారు. తిరువూరు వాహినీ కాలేజీలో విద్యార్థులకు 'కేర్' కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలకు బానిసైన వారు సమాజానికి దూరమవుతారన్నారు. మనిషిని నైతికంగా, ఆర్థికంగా దిగజార్చే శక్తి మత్తు పదార్థాలకు ఉందని చెప్పారు. ఉన్నత స్థితిలో ఉన్న తల్లిదండ్రులు సైతం తమ పిల్లల ప్రవర్తనను కనిపెట్టకపోతే వారు తప్పుదోవ పడతారని హెచ్చరించారు. కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు, ఎక్సైజ్ ఎస్ఐ కృష్ణవేణి పాల్గొన్నారు.

ఉగ్ర దాడులకు నిరసనగా క్యాండిల్ ర్యాలీ



తిరువూరులో వైఎస్సార్ సీపీ నాయకుల కొవ్వొత్తుల ప్రదర్శన



కుంటముక్కల గ్రామంలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నాయకులు

తిరువూరు: కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చివేసిన ఘటనను నిరసిస్తూ తిరువూరులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఉగ్రవాదం నశించాలని, ప్రజలకు రక్షణ కల్పించి దోషులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. వైఎస్సార్ సీపీ తిరువూరు పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, వార్డు కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, మోదుగు ప్రసాద్, నాయకులు రేగళ్ల మోహన్‌రెడ్డి, గత్తం నాగేశ్వరరావు, యరదేశి రామారావు, కాలసాని గోపాల నాగేశ్వరరావు, బొర్రా మోహనరావు, సురేష్, జాకీర్, వేణు, మారేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జి.కొండూరు: ఉగ్ర దాడి మృతులకు మండల పరిధి కుంటముక్కల గ్రామంలో సర్పంచ్ వంగూరి కుమారి ఆధ్వర్యంలో శనివారం కొవ్వొత్తుల వెలిగించి నివాళులర్పించారు. ఈ దాడిలో పాల్గొన్న తీవ్రవాదులతో పాటు వారికి సహకరించిన ప్రతి ఒక్కరినీ మట్టుబెట్టినప్పుడే మృతుల ఆత్మలకు శాంతి చేకూరుతుందని సర్పంచ్ కుమారి అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పామర్తి వెంకటనారాయణ, వంగూరి కెనడి, పామర్తి అప్పారావు, పామర్తి రామారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

‘వెలుగు’లోకి అధికారుల అక్రమాలు

- పుస్తకాల ధర పెంచి దోపిడీ
- ఒక్కో పుస్తకం ధర రూ. 200లకు పైగా పెంపు
- మండలంలో 1,470 స్వయం సహాయక సంఘాలు



డ్వాక్రా మహిళల సమావేశం (ఫైల్)

ఆగిరిపల్లి: డ్వాక్రా మహిళల సొమ్మును వెలుగు సిబ్బంది దోచేస్తున్నారు. మండలంలో వెలుగు కార్యాలయ అధికారులు గ్రామ సమైక్య సంఘ పుస్తకాల్లో కూడా చేతివాటం ప్రదర్శించి వేల రూపాయలు దోచేస్తున్నారు. మండలంలో మొత్తం 1,470 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. గతంలో వీరికి సెర్ప్ కార్యాలయం నుంచి ఉచితంగా డ్వాక్రా సంఘాలకు స్వయం సహాయక సంఘ ఆర్థిక లావాదేవీల సంబంధిత పుస్తకాలను, వ్యక్తిగత పాసు పుస్తకాలను ఉచితంగా అందజేసేవారు. తర్వాత రూ. 200 ధరతో పుస్తకాలను అందించేవారు. అది కూడా స్వయం సహాయక సంఘ సభ్యుల ఖాతా నుంచి డబ్బులను చెల్లించేవారు.

సొంతంగా పుస్తకాలు ప్రింట్ చేయించి..

కొన్ని నెలల నుంచి స్థానిక వెలుగు కార్యాలయంలోని సంబంధిత అధికారులు సొంతగా పుస్తకాలను ప్రింట్ చేయించి నాలుగు వందల రూపాయలకు వీఓఏలతో కొనుగోలు చేయిస్తున్నారు. డ్వాక్రా మహిళలకు వీటిపై అవగాహన లేకపోవడంతో అధికారులు వసూళ్ల పర్వం ప్రారంభించారు. పుస్తకాలలో పేజీలు మిగిలి ఉన్నా సరే బలవంతంగా వీఓఏలకు కొత్త పుస్తకాలు ఇచ్చి ఒక్కో మహిళా సంఘం నుంచి అధికంగా రూ. 200 వసూలు చేస్తున్నారు. ఇలా మండలంలో డ్వాక్రా మహిళల నుంచి కొన్ని వేల రూపాయలు వసూలు చేశారు. పుస్తకాల కోసం మహిళల నుంచి రూ. 400 వసూలు చేయడమే కాకుండా వారి పొదుపు ఖాతాలో నుంచి కూడా సభ్యులకు తెలియకుండా పుస్తకాలు ముద్రించే వారికి డబ్బులు చెల్లించారని ఆరోపణలు ఉన్నాయి. ఇదే కాకుండా మండలంలో 42 మంది వీఓఏలు ఉన్నారు.

గతం కంటే రెట్టింపు ధరకు..

లావాదేవీలకు సంబంధించిన పుస్తకాల కోసం గతంలో రూ.పదిహేను వందలకు కొనుగోలు చేసేవారు. ఇప్పుడు ఏకంగా ఆ పుస్తకాలను రూ. మూడు వేలకు వీఓ నిధి నుంచి వీఓఏలతో బలవంతంగా డ్రా చేయించి సంబంధిత అధికారికి సమర్పించుకుంటున్నారు. పుస్తకాల కొనుగోలుకు సంబంధించిన చెల్లింపులు ఆన్‌లైన్ ద్వారానే జరగాలి. కానీ అధికారులు చేతివాటం ప్రదర్శించడం ఏమిటో అర్థం కావడం లేదని పలువురు వాపోతున్నారు. దీనిపై జిల్లా అధికారులు సమగ్ర విచారణ చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని పలువురు డ్వాక్రా సంఘ సభ్యులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

డ్వాక్రా సంఘాలు సంబంధిత పుస్తకాలను బలవంతంగా తీసుకోమని చెప్పడం లేదు. సభ్యులు వారికి నచ్చిన చోట తీసుకోవచ్చు. అలాగే మండలంలో వీఓఏలు డ్వాక్రా మహిళా సంఘాల లావాదేవీల పుస్తకాలను అధిక ధరకు ఎక్కడైనా అమ్మినట్లు తెలిస్తే వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

– ఏపీఎం, రాజశేఖర్, ఆగిరిపల్లి

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా

ఆగిరిపల్లి: బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి తహసీల్దార్ ప్రసాద్ రూ.20 వేలు జరిమానా విధించారు. ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపిన వివరాల ప్రకారం గతంలో తహసీల్దార్ ఎదుట బైండోవర్ అయిన ఆగిరిపల్లికి చెందిన పల్లగాని శివయ్య మరలా అక్రమంగా సారా విక్రయిస్తూ పట్టుబడ్డాడు. ఎక్సైజ్ అధికారులు శివయ్యను అరెస్టు చేసి తహసీల్దార్ ప్రసాద్ ఎదుట బైండోవర్ చేయగా నిబంధన ఉల్లంఘించినందుకుగాను శివయ్యకు రూ.20 వేల జరిమానా విధించారు. మరో నలుగురు పాత నేరస్తులను బైండోవర్ చేశారు.

సారా విక్రేతల బైండోవర్

ముసునూరు: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా అక్రమంగా సారా విక్రయాలు నిర్వహించిన పాత కేసుదారులు ఆరుగురిని శనివారం తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ ఎదుట బైండోవర్ చేశామని నూజివీడు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. చెక్కపల్లికి చెందిన బాలిన ధర్మ, తాళం వరలక్ష్మి, నక్కాదుర్గ, లోపూడికి చెందిన మరీదు నాగేశ్వరరావు, అక్కిరెడ్డిగూడెంకు చెందిన చల్లారి మారయ్య, చిల్లబోయినపల్లికి చెందిన మిడతా శ్రీనులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు.

రేపటి నుంచి శిక్షణ తరగతులు

తిరువూరు: విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు ఈ నెల 28 నుంచి తిరువూరు గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో జరుగుతాయని గ్రంథాలయాధికారి కొరివి పద్మావతి తెలిపారు. పుస్తక పఠనంపై ఆసక్తి కల్పించడం, చదరంగం, యోగాలో శిక్షణ, పేపర్ క్రాఫ్ట్, ఇండోర్ గేమ్స్, తెలుగు నేర్పించడం, ఇంగ్లిష్ మాట్లాడటంలో శిక్షణ, పాటలు, మిమిక్రీ, డ్యాన్స్‌లో శిక్షణా తరగతులు ఉంటాయని చెప్పారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు శిక్షణ కొనసాగుతుందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

ముఠా కార్మికుల హక్కుల రక్షణకు చట్టాలు అవసరం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముఠా కార్మికుల హక్కుల రక్షణకు చట్టాలు తీసుకురావాలని సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ అనుబంధ ముఠా కార్మిక సంఘం 43వ మహాసభ సందర్భంగా కార్మికులు పాతబస్తీ లెనిన్ భవన్ నుంచి శనివారం ప్రదర్శన నిర్వహించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎటువంటి చట్టం లేనటువంటి ముఠా కార్మికుల జీవితాలకు భద్రత లేకుండా పోయిందన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు లేకపోవడంతో వృద్ధాప్యంలో వారికి ఎటువంటి భద్రత లేదన్నారు. పెరిగిన ధరలకు జీవనాన్ని కొనసాగించ లేని కార్మికులకు సొంత ఇళ్లు లేని దుస్థితి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు లేని ముఠా కార్మికులకు ఇంటి స్థలం, ఇచ్చి నిర్మాణానికి ఆర్థిక సహాయం చేసేందుకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు, ముఠా కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వియ్యపు నాగేశ్వరరావు, ఏఐటీయూసీ నగర అధ్యక్షులు కేఆర్ ఆంజనేయులు, ముఠా కార్మిక సంఘం నగర అధ్యక్షుడు చొప్ప శ్రీరామచంద్రమూర్తి, సంఘం నాయకులు బోను చిన్న శ్రీరాములు, బత్తుల తిరుపతయ్య, నాగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బైపిళ్ళ సత్యనారాయణ, మరిపిళ్ళ మధు, జగదాపు సన్యాసిరావు, కాకి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.